సంక్రాంతి శుభాకాంక్షలు

శ్రీవారి సేవలో...



తలారికి శ్రీవారి మొమెంటోను అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆదివారం సందర్శించారు. ఈఓ వేంద్ర త్రినాధరావు ఆలయ మర్యాదలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను ఎమ్మెల్యే తలారి దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాలు అందజేశారు.

నిర్వాసిత గ్రామాల్లో క్రికెట్ పోటీలు

బుట్టాయగూడెం: తూటిగుంట నిర్వాసిత గ్రామంలో ఆదివాసీ మన్యం క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. 16 టీమ్‌లు పాల్గొనగా కొండ్రుకోట టీమ్ విజేతగా నిలవగా రన్నరప్‌గా కొరుటూరు క్రికెట్ టీమ్ నిలిచింది. విజేతలకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు బహుమతులను అందజేశారు.

గిరిపల్లెలో సంక్రాంతి శోభ



కొయ్యలగూడెంలో ఏర్పాటుచేసిన సంక్రాంతి సెట్టింగ్



లింగపాలెం మండలంలో నిర్వహిస్తున్న కోడిపందేలు

బుట్టాయగూడెం: గిరిపల్లెలో సంక్రాంతి శోభ సంతరించుకుంది. దుద్దుకూరులో జరిగిన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే బాలరాజు, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త రాజ్యలక్ష్మి పాల్గొని భోగి మంటల చుట్టూ గిరిజన మహిళలతోపాటు నృత్యాలు చేశారు.

కొయ్యలగూడెం: భోగి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తాడేపల్లిగూడెం రోడ్డులోని పెన్మెత్స వంశీయులు సంక్రాంతి సెట్టింగ్‌లు ఏర్పాటు చేసి సంబరాలు నిర్వహించారు.

చింతలపూడి: ఏపీ ఫైర్ అండ్ డిజాస్టర్ డీజీపీ పీవీ సునీల్‌కుమార్ స్థానికులతో కలిసి భోగి పండుగ జరుపుకున్నారు. దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా చేయటం తన లక్ష్యమని పేర్కొన్నారు.

జోరుగా కోడిపందేలు

చింతలపూడి: పోలీసుల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ భోగిరోజు కోడిపందేలు జోరుగా సాగాయి. లింగపాలెం మండలంలోని కలరాయనగూడెం, ములగలంపాడు, సింగగూడెం, కామవరపుకోట మండలంలోని కొత్తూరు, రావికంపాడు, వీరిశెట్టిగూడెం, కళ్ళచెర్వు, కామవరపుకోట, చింతలపూడి మండలం రాఘవాపురం ,చింతంపల్లి, రేచర్ల, జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం, లక్కవరం, గుర్వాయిగూడెం, పంగిడిగూడెం, పేరంపేట గ్రామాల్లో కోడి పందేలను వేశారు.

బుట్టాయగూడెం: దొరమామిడి, దుద్దుకూరు, వెలుతురువారిగూడెం, రెడ్డిగణపవరం, అంతర్వేదిగూడెం ,యర్రాయిగూడెంగ్రామాల్లో కోడిపందేలు జరిగాయి.

ద్వారకాతిరుమల: తిమ్మాపురం, పంగిడిగూడెం, ఎం.నాగులపల్లి, గుణ్ణంపల్లి, రాళ్లకుంట, దొరసానిపాడు, ద్వారకాతిరుమల, జి.కొత్తపల్లి, వేంపాడు గ్రామాల్లో కోడిపందేలను నిర్వహించారు. కొన్ని బరుల్లో రాత్రి వేళ సైతం పందేలను జరిపారు.

మావి కూర పందేలు



సంప్రదాయ కోడి పందేలను ప్రారంభిస్తున్న బాలరాజు

బుట్టాయగూడెం: సంక్రాంతి పండుగ సందర్భంగా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులంతా కోడి పందేలు నిర్వహించుకోవడం సంప్రదాయమని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. ఆదివారం భోగి సందర్భంగా దుద్దుకూరు సమీపంలో సంప్రదాయ కోడిపందేలను ప్రారంభించారు. తమవి కత్తుల పందేలు కావని.. కూర పందేలు అని బాలరాజు తెలిపారు. కోళ్ల పోరాడి అలసిపోతాయని ఈ పందెంలో పారిపోయిన కోడి ఓడిపోయినట్లని చెప్పారు. ఇదే తరహాలో సంక్రాంతి, కనుమ రోజున కూడా జరుపుకుంటామని చెప్పారు.

వైభవం.. గోదా రంగనాథుల కల్యాణోత్సవం



పారిజాతగిరిలో గోదా రంగనాథుల కల్యాణోత్సవం

జంగారెడ్డిగూడెం: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా 29వ రోజు భోగి పండుగను పురస్కరించుకుని పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ కల్యాణ వేదిక వద్ద గోదా రంగనాథుల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున తిరుప్పావై ప్రవచనం, అనంతరం ఆరాధన, తోమాలసేవ, బాలభోగ నివేదన తీర్థప్రసాదగోష్ఠి అనంతరం భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం జరిగిన గోదాదేవి కల్యాణాన్ని భక్తులు వీక్షించి తరించారు.

రెండోసారి జగన్‌ను సీఎం చేయడమే లక్ష్యం



లింగపాలెంలో బీవీఎస్ రెడ్డిని కలిసి సత్కరిస్తున్న కంభం విజయరాజు

లింగపాలెం: పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు అన్నారు. సోమవారం ఆయన మఠంగూడెంలోని పార్టీ సీనియర్ నాయకుడు మందలపు సత్యన్నారాయణ, లింగపాలెంలో పార్టీ జిల్లా నాయకులు భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి (బీవీఎస్‌రెడ్డి)లను మర్యాదుపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలు కప్పి వారి ఆశీస్సులను కోరారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు. వైస్ ఎంపీపీ మట్టా సురేష్, మండల పార్టీ అధ్యక్షుడు కొఠారి మోహన్, ధర్మాజీగూడెం సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, పార్టీ నాయకులు రావి కొండయ్య, చెలికాని చిట్టియ్య, కోటగిరి హరీష్, పి వేమనరెడ్డి, ఎం.చంటియ్య, ఎం.వీరబద్రరావు, యు గోపి తదితరులను విజయరాజు కలిశారు.



















